
ప్రజాశక్తి

మంగళవారం 21 జనవరి 2025

5

పార్వతీపురం మన్యం



మార్చి 31లోపు పన్నుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో బకాయిపడి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కొళాయి పన్నులు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ జి.శ్రీనివాసరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పన్ను బకాయిదారుల నివాస గహాలకు సంబంధించి ఎలక్ట్రికల్ కనెక్షన్లు తొలగించేందుకు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేశామన్నారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కుళాయి కనెక్షన్లు బకాయిలు చెల్లించే వరకు నిలిపివేస్తామని తెలిపారు. కావున బకాయి పడ్డ ఇంటి పన్నులు ఖాళీ స్థలం పన్నులు, కొళాయి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు అడ్వర్టైజ్మెంట్ చార్జీలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులు చెల్లించాలని తెలిపారు.

దమ్ముంటే పట్టుకోండి

- పోలీసులకు సవాల్‌గా బెల్టుషాపుల నిర్వహణ
- ప్రోత్సహిస్తున్న సిండికేట్ వ్యాపారులు

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలో మద్యం బెల్టుషాపులు ఊరూరా విచ్చలవిడిగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి నుంచి జిల్లా ఎక్సైజ్ అధికారులు వరకు హెచ్చరించినప్పటికీ యథేచ్ఛగా బెల్టుషాపుల ద్వారామద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మరోవైపు బెల్ట్ షాపులకు అమ్మకాలు చేసిన వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని సిఎం హెచ్చరికలు జారీచేసినా అవేవీ పట్టించుకోకుండా బెల్ట్ షాపుల నిర్వహణకు సిండికేట్ మద్యం దుకాణదారులు పూర్తిస్థాయిలో ప్రోత్సహించడంతో ప్రతి గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. ఇటీవల పండగ నేపథ్యంలో ప్రతి ఊరిలోనూ బెల్ట్ షాపులతో పాటు అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. పర్యవేక్షణ చేయాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంతో సిండికేట్ వ్యాపారులు రెండు దుకాణాల పరిధిలో మండలంలోని గుణానుపురం, కల్లికోట, దుగ్గి, శివిని, అర్తాం, గుమడ, కొమరాడ, పూర్ణపాడు, దేవుకోన, పెదశేఖ, మసిమండ, కూనేరు, చోళ్లపదం, మాదలింగి తదితర గ్రామాల్లో సుమారు 200 బెల్టు షాపులు అమ్మకాలు జరుపుకొని సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి.



మద్యం షాపులో సంచితో మద్యం బాటిళ్లు పడుతున్న బెల్టుషాపు నిర్వాహకుడు

మండలంలో ప్రభుత్వ అనుమతితో కొమరాడ, విక్రంపురంలో రెండు లైసెన్డ్ దుకాణాలున్నాయి. ఆయా దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది, యాజమాన్యాలు పలు గ్రామాల్లో బెల్టు దుకాణాలు ప్రోత్సహిస్తూ వీరే స్వయంగా గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రెండు దుకాణాల్లో మద్యం అమ్మకాలు సాధారణంగా ఉన్నప్పటికీ అత్యధికమంది వాటాదారులు ఉండడంతో తమకేమీ లాభాలు రావడం లేదని బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. పండగ వారం రోజులు మద్యం దుకాణాలతో పాటు బెల్టు షాపులకు మంచి గిరాకీ ఉండడంతో బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు పెంచారు. అక్రమ మద్యం అమ్మకాలు నిర్మూలించాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు దుకాణదారుల నుంచి మామూళ్లు తీసుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని సిండికేట్ వ్యాపారులకు షాపులు అప్పగించి నప్పటి నుంచి ఇప్పటి వరకూ ఒక్క బెల్టుషాపును పట్టుకోకపోవడం, కేసులు పెట్టకపోవడం విశేషం. తక్షణమే బెల్టు షాపుల నిర్వహణను అడ్డుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణపై త్వరలో మహిళలు, గ్రామ ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్నారు. విషయంపై ఎక్సైజ్ సిఐ కరణం సురేష్ వివరణ కోరగా బెల్ట్ షాపులు నిర్వహణపై పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే షాపులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బెల్ట్ షాపులకు తరలించిన మద్యం దుకాణాలపై మొదటిసారి పట్టుపడితే రూ . 5లక్షలు జరిమానా, రెండోసారి దొరికితే షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.



సాలూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో మంత్రి పాల్గొని 139 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన అర్జీదారులు పాల్గొని, తమ సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉండే సమస్యలను తక్షణ పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సమస్యను జిల్లా అధికారుల సమక్షంలో పరిష్కరిస్తామని, గత ప్రభుత్వంలో భూసమస్యలు విపరీతంగా పెరిగిపోయాయని మంత్రి తెలిపారు. ప్రజావేదికలో ఎక్కువగా భూసమస్యలు, ఇళ్ల పట్టాలు, పింఛన్లు, టిడ్కో గృహాలు, రహదారులు, తాగునీరు తదితర సమస్యలకు చెందిన అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. వచ్చిన అర్జీల్లో కొందరి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. స్వీకరించిన వినతుల్లో కొన్ని....

సాలూరు పట్టణంలో గత టిడిపి హయాంలో 365 చదరపు అడుగు టిడ్కో ఇల్లు మంజూరు కాగా, రూ.12,500 చొప్పున మూడు డీడీలు ఇచ్చామని, కానీ నేటికీ ఇల్లు ఇవ్వలేదని, కావున తమకు ఇళ్లు ఇప్పించాలని 13వ వార్డుకు చెందిన పప్పుల లక్ష్మి, ఎం.కనకదుర్గ, ఎం.కష్ణవేణి, ఎల్.కల్పన, పి.పార్వతి,డి. తిరుపతమ్మ, ఆర్.సరస్వతి, పి.గౌరి, జి.రేవతి తదితరులు మంత్రికి దరఖాస్తును అందజేశారు. సాలూరులోని పెదకోమటి పేట 26వ వార్డు నుంచి కటమ పరమేశ్వరరావు తనకు వృద్ధాప్య పింఛను మంజూరుచేయాలని కోరారు. 9వ వార్డు ముత్తారసు వీధికి చెందిన ఎస్.తిరుపతిరావు తనకు 15 నెలల క్రితం పక్షవాతం వచ్చిందని, సదరన్ సర్టిఫికేట్ లేకపోవడంతో పింఛను రావడం లేదని, కావున సదరన్ సర్టిఫికేట్ ఇప్పించి, పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్, సాలూరు, పాచిపెంట, మక్కువ తహశీల్దార్లు ఎన్‌విరమణ, డి.రవి, షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒలు పాత్రో, రమాదేవి, స్వరూపా రాణి, డిఎల్డిఓ రమేష్ రమణ, జిఎస్‌డబ్ల్యుఎస్ వి.చిట్టిబాబు, మెడికల్ ఆఫీసర్ శివకుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ స్థలానికి ప్రహరీ నిర్మించాలని వినతి

సాలూరు : ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి కేటాయించిన 1.10 ఎకరాల భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని కోరుతూ ప్రిన్సిపల్ రవికుమార్, ప్లేస్ మెంట్ అధికారి కోట్ల శ్రీనివాసరావు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో వారు మంత్రి సంధ్యారాణిని కలిసి సమస్యల్ని వివరించారు. కేటాయించిన భూమి ఆక్రమణకు గురికాకుండా వుండాలంటే దాని చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలన్నారు. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో సమస్యకు పరిష్కారం చూపినందుకు వారు మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రహరీ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

పార్వతీపురంరూరల్ : ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం లేకుండా చూడాలని ఎఎస్‌పి డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు,భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం,ప్రేమ పేరుతో మోసం,ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని,తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 5 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎస్సై ఫకద్దీన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలపై తక్షణ చర్యలు తీసుకోండి : కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి

పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 68 వినతులు వచ్చాయని, వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉపకలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి జిల్లా అధికారులను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖాధికారులు పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు తెలిపారు. పరిష్కారమైన అర్జీలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, అర్జీలు పునఃప్రారంభం కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అందిన కొన్ని అర్జీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

గుమ్మలక్ష్మీపురం మండలం చింతలపాడుకు చెందిన ఎన్.సింహాచలం ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం పంచాయితీల్లోని అక్రమ కట్టడాలను తొలగించాలని వినతి పత్రాన్ని అందజేశారు. తమ ఇంటి పక్కన ఉన్న హెచ్.టి లైన్ కరెంటు స్తంభాలు వాలి ఉండడంతో మేడపైకి వెళ్లలేకపోతున్నామని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని, కావున దీనిపై చర్యలు తీసుకోవాలని గరుగుబిల్లికి చెందిన ఎన్.చంద్రశేఖర రావు అర్జీని అందించారు. తమ గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 127/సిలో గల 0.78 సెంట్లు భూమిని పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదు చేయాలని కురుపాంకు చెందిన ఎం.వాసుదేవరావునాయుడు దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం మండలం డోకిశీలలో సుమారు 4 ఎకరాల్లో ఉన్న భూమిని ప్రభుత్వం సర్వే చేయించి 1-బి, పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని బి.నారాయణరావు కోరారు. సాలూరు మండలం అన్నంరాజువలస నుంచి ఎం.ఎల్లమ్మ అర్జీని ఇస్తూ తనకు జీవనాధారం నిమిత్తం మేకల పెంపకం కొరకు సబ్సిడీతో కూడిన రుణాన్ని మంజూరు చేయాలని దరఖాస్తు అందించారు. గరుగుబిల్లి మండలం బురదవెంకటాపురానికి చెందిన బి.సత్యంనాయుడు గత రెండు మాసాలుగా తనకు పింఛను అందడంలేదని, కావున దాన్ని మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. పెదగుడబకు చెందిన ఎన్.తేరిజమ్మ తనకు వితంతు పింఛను ఇప్పించాలని, గరుగుబిల్లికి కె.సత్యంనాయుడు తనకు చెవిటి మిషన్ మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులను రద్దుచేయాలి

ప్రజాశక్తి - సాలూరు

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను వెంటనే రద్దు చేయాలని, గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడం ఆపాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన బాధిత గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో హైడ్రో పవర్ ప్రాజెక్టును ఈ ప్రాంతంలో నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో సుమారు 7 గిరిజన గ్రామాలు వందలు ఎకరాలు సాగు భూమి మునిగిపోతాయని, వారి జీవన విధానం అస్తవ్యస్తంగా మారిపోతుందని తెలిపారు. అదానీతో ఒప్పందాలను అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో అదానీ కంపెనీకి చెందిన కొంతమంది వ్యక్తులు, ప్రభుత్వ అధికారులు కలిసి గ్రామాల్లో తిరుగుతూ గిరిజనులను పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఎందుకు ఉన్నారని, ఇక్కడ పవర్ ప్రాజెక్టు నిర్మిస్తామనిఅడ్డుకోవద్దని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇచ్చిన అనుమతులను రద్దుచేసి గిరిజనులకు రక్షణగా ఉండాలని కోరారు. వీరి జీవన విధానాలను, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా అవినీతి, అక్రమాల పైన కేసులు నమోదవుతున్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదానీకి అడవులను, నదులను సహజ వనరులను అప్పగించాలనుకోవడం సరికాదని చెప్పారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఊడిగం చేసేలా ఉండడం సరికాదన్నారు. గిరిజనులకు రక్షణగా నిలబడాలని ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు అయోధ్య, సీదరపు కాముడు, శంకర్రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మించనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



జాతర రూట్‌మ్యాప్ ప్రదర్శిస్తున్న తహశీల్దార్ షేక్ ఇబ్రహీం

జాతర రూట్ మ్యాప్ సిద్ధం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పోలమాంబ అమ్మవారి రాష్ట్ర జాతరకు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు తహశీల్దార్ షేక్ ఇబ్రహీం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ ఆదేశాల మేరకు ఈ మ్యాపును సిద్ధం చేశామని తెలిపారు. అలాగే సాలూరు నుంచి మక్కువ వచ్చే వాహనాలకు అవసరమైన మేరకు పార్కింగ్ కోసం ప్రభుత్వ స్థలాలు కూడా గుర్తించామన్నారు. మక్కువ నుండి వెళ్లే వాహనాలకు శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని పశువుల పాక ఉండే స్థలాన్ని గుర్తించామని తెలిపారు. అలాగే వెంగళరాయసాగర్ ప్రాజెక్టు సమీపాన కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రైవేటు పార్కింగ్ స్థలాలు కాకుండా అవసరమైతే వీటిని వినియోగిస్తామని ఆయన తెలిపారు .

పోలమాంబం గుడి వద్ద బోరు ఏర్పాటు

మండలంలోని శంబరకు చెందిన నైదాన తిరుపతిరావు పోలమాంబ అమ్మవారి వనం గుడి వద్ద యాత్రికుల సౌకర్యార్థం తాగునీటి బోరుబావిను ఏర్పాటు చేశారు. సోమవారం బోరుబావిని ఆయన ప్రారంభించారు. ఇప్పటికే తాగునీటి సౌకర్యం ఉన్నప్పటికీ అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్న నేపథ్యంలో ఉచితంగా తన డబ్బులతో బోరుబావిని ఏర్పాటు చేయడంపై పలువురు ప్రసంశిస్తున్నారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు తాగునీటి ఇబ్బంది తొలగేందుకు ఈ బోరు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు భావిస్తున్నారు. కార్యక్రమంలో ఎం.రాము, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ర్యాలీ, ధర్నా

- 5లోగా సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె
- ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం మున్సిపల్ కార్మికులు గాంధీ నగరం నుంచి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం గ్రీవెన్స్ వద్ద ధర్నా చేపట్టారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, యూనియన్ సాలూరు అధ్యక్ష కార్యదర్శులు టి.రాముడు, టి.శంకర్రావు మాట్లాడారు. జీతాల కోసం ప్రతి నెలా ఎదురుచూడాల్సిన పరిస్థితి మున్సిపాలిటీలో ఉందని, ఏనెల జీతం ఏ సమయానికి వేస్తారో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. పండగల పూట కార్మిక కుటుంబాలు పస్తువులతోనే ఉన్నాయని, డిసెంబర్ జీతం ఇంకా వేయలేదని, జనవరి జీతం ఎప్పుడు వస్తుందో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రెండున్నరేళ్లుగా గత పాలకవర్గం కాలయాపన చేస్తే, నేడు కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా కదలికలేదని, చనిపోయిన వారి కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని పట్టణాల్లో సబ్బులు, నూనెలు, చెప్పులు ఇస్తున్నా, ఇక్కడ డబ్బులు లేవనే కుంటి సాకులతో తప్పించుకుంటున్నారని చెప్పారు. జీవో 36 ప్రకారం డ్రైవర్ల వేతనాలు ఇవ్వాలని కోరారు. గ్రీవెన్స్‌కు హాజరైన మంత్రి సంధ్యారాణి కార్మికుల వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకొని మాట్లాడారు. బకాయి జీతాలు వెంటనే వేయించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య లేకుండా చేస్తానని, కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, చెప్పులు మున్సిపాలిటీ వద్ద నిధులు లేకుంటే తన నిధుల నుండి ఇచ్చి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు వీలైనంత తొందరగా ఉద్యోగాలు వేసేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అధికారులు మంత్రి హామీని అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించుకుంటే ఫిబ్రవరి 5 తర్వాత సమ్మెకు వెళ్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, లింగరాజు, దేవి, ఆదినారాయణ, శ్రీను, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు



కార్మికులతో చర్చిస్తున్న మంత్రి

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీలోని ఇప్పమానుగూడ, చింతమానుగూడ, తిత్తపాయగూడ, వబ్బంగి పంచాయతీలో గల పీరంగూడ, తియ్యాలిగూడ, ఏగులువాడ పంచాయితీలో గల ఇప్పలగుడ్డి గ్రామాలకు సంబంధించి ఆరు అంగన్వాడీ హెల్పర్ పోస్టు మంజూరయ్యావని సిడిపిఒ కె.విజయగౌరి సోమవారం తెలిపారు. ఈ మేరకు ఈనెల 20 నుండి 27 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోనున్న అభ్యర్థులు ఎస్‌టి కులానికి చెంది, టెన్త్ పాస్పై, 21 నుంచి 35ఏళ్లలోపు వారి ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు వారి కుల, నివాస, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లు గెజిటెడ్ అధికారిచే సంతకాలు చేయించి ఐసిడిఎస్ ప్రాజెక్ట్, కురుపాం వారి కార్యాలయమునకు నేరుగా గాని / పోస్ట్ ద్వారా గాని అందజేయాలని తెలిపారు.

పార్వతీపురంరూరల్: మండలంలోని చుక్కవానివలస అంగన్వాడీ కేంద్రంలోని సహాయకురాలి పోస్టు నియామకానికి దరఖాస్తులను కోరుతున్నట్లు సిడిపిఒ బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక స్థిర నివాసం ఉండి, ఎస్‌టికి చెంది పదో తరగతి ఉత్తీర్ణత పొంది 21 నుంచి 35 మధ్య వసు గల మహిళ అభ్యర్థినులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. కావున ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను ఈనెల 20 నుంచి 27వరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు, పార్వతీపురం వారి కార్యాలయములో అందజేయాలని కోరారు.

సీతంపేట : మండలంలోని రేగులగూడ, దిగువ బుడగరాయిలో కొత్తగా రెండు అంగన్వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని సిడిపిఒ పి.రంగలక్ష్మి ఒక ప్రకటన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రెండు కేంద్రాలకు అంగన్వాడీ హెల్పర్లు పోస్టులు నియమించేందుకు దరఖాస్తులు ఈనెల 27లోగా ఇవ్వాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆ గ్రామానికి చెందిన యువతై ఉండి 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పీసా ఎన్నికలు నిర్వహించలేదని ఫిర్యాదు

పార్వతీపురం: పీసా ఎన్నికలు నిర్వహిస్తామని నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత సాలూరు మండలం తుండు, మక్కువ మండలం పనసబద్ర పంచాయతీల్లో పీసా ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ఆదివాసీ జేఏసీ చైర్మన్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఎజెఎసి గౌరవాధ్యక్షులు నిమ్మక జయరాజ్, వైస్ చైర్మన్ కొండగొర్రి ఉదయ్ కుమార్ ఆధ్వర్యాన గిరిజన నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు అందజేశారు. తుండ, పనసబద్ర పంచాయతీలను పీసా ఎన్నికల నోటిఫికేషన్‌లో పొరపాటున చూపించామని అధికారులు చెప్పడం సరికాదన్నారు. రాజ్యాంగం కల్పించిన పీసా, 1/70 చట్టాలను అమలు చేయకుండా గిరిజనుల హక్కులను కాలరాసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆదివాసీ జెఎసి వైస్ చైర్మన్ కొండగొర్రి ఉదయ్ కుమార్ ఆరోపించారు. వెంటనే పనసబద్ర, తుండ, తోణాం పంచాయతీల్లో పీసా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు రక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

అరాచక శక్తులబారిన పడిన అసహాయ మహిళలకు అండగా నిలవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గడ్డం ఉమా అన్నారు. సోమవారం పార్వతీపురం వన్‌స్టాప్ కేంద్రాన్ని సందర్శించిన ఆమె, సెంటర్ ఇన్చార్జి ఎస్.శాంతికుమారితో కలిసి కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. ఇంతవరకు ఈ కేంద్రంలో 77 కేసులు నమోదు కాగా, అందులో 6 పోక్సో, 28 గృహహింస కేసులో ఉన్నట్లు కనుగొన్నారు. అనంతరం జిల్లా కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవితో ఫోన్లో మాట్లాడి బాధితులకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. అనంతరం కేంద్రానికి సంబంధించిన గోడపత్రికను సిబ్బందితో కలిసి విడుదల చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్రమహిళా కమిషన్ సభ్యులు ఉమా


సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని బలదగూడకు చెందిన మహిళ పురిటి నొప్పులు వస్తున్నాయని కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీతంపేట 108 సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు అప్పటికే పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీని అంబులెన్సులో సీతంపేట ఏరియా హాస్పిటల్‌కు తీసుకువస్తుండగా నొప్పులు అధికం కావడంతో వెహికల్‌ను పక్కకు ఆపి డెలివరీ కండక్ట్ చేశారు, పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ బిడ్డ క్షేమంగానే ఉన్నారు. 108 ఇఎంటి రాములు, పైలెట్ శంకర్రావు కృషికి కుటుంబం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు వినతులు సమర్పించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిహెచ్ఓ ఎస్‌వి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద గదవలసకు చెందిన రాయల కృష్ణారావు బిటి రోడ్డు మంజూరు చేయాలని, మూలగూడ ఎంపిపి స్కూల్‌కు కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు మంజూరు చేయాలని పాలక చౌదరి విన్నవించారు. బుర్జిగూడ చెందిన రహుల్ పవర్ టిల్లర్, బంగారుగూడకు చెందిన సింహాచలం కార్పెంటర్ కిట్ మంజూరు చేయాలని కోరారు. సన్యాసిపేటకు చెందిన బాలికేవాడు ట్రాక్టర్, రేగులగూడకు చెందిన రాధా స్వీయింగ్ మిషన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రమాదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయపార్వతి, ఎడి శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఎపిఓ సన్యాసిరావు, ఎంఎల కోటిబాబు, ఆర్డబ్ల్యుఎస్ జెఇ సత్యం, ఎఇ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

18ఎల్ కాలువలో పూడిక తీత

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంగళరాయసాగర్ ఎడమ బ్రాంచ్ కాలువ పరిధిలోని 18 ఎల్ కాలువలో పూడికతీతలు చేపట్టారు. సోమవారం విఆర్ఎస్ ఆయకట్టు సంఘం చైర్మన్ ఎం.గౌరవరిరి ఈ పనులను ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఈ కాలువలో పూడికతీతలు తీయకపోవడం వల్ల రైతులకు సాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఏర్పడేవి. పూర్తిస్థాయిలో పూడికతీతలు పూర్తయితే కోన, గోపాలపురం, తూరుమామిడి రైతులకు ఎంతో ఉపయోగం కలగనుంది.


యువతకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ ప్రసాద్

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - సాలూరు

రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జెఎస్ఎన్‌వి ప్రసాద్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వాహనాలను నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో తాత్కాలిక పద్ధతిలో మెడికల్ ఆఫీసర్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్, సీనియర్ డి ఆర్ -టి బీ, టి బీ - హెచ్‌ఐవి సూపర్ వైజర్, అకౌంటెంట్ ఐదు పోస్టులు భర్తీ చేశారన్నారు. నియామకాల్లో ఎటువంటి రిజర్వేషన్ పాటించలేదన్నారు. ఇది ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయమన్నారు. నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.


క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న సర్పంచ్ మిన్నారావు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కురుపాం

క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని మండలంలోని జి.శివడ సర్పంచ్ బి.మిన్నారావు అన్నారు. గత వారం రోజులుగా జి.శివడ పంచాయతీలో గల మధురవలస గిరిజన గ్రామంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచి నైపుణ్యం సాధించాలన్నారు. అనంతరం ప్రథమ బహుమతి చినమేరంగి జట్టుకు, ద్వితీయ బహుమతి జొంగానవలస జట్టుకు, తృతీయ బహుమతి గుంజరాడ జట్టుకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గురుబిల్లి రాజారావు, పిడి భానుమూర్తి, స్థానిక పెద్దలు కృష్ణారావు, సుక్కులు, గ్రామ యువత మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

8 మందిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన భూసరి రాజేష్ ఖన్నాను కులం పేరుతో దూషించారని ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై జి కళాధర్ కేసు నమోదు చేశారు. పాలకొండ డిఎస్పి రాంబాబు విక్రంపురం గ్రామంలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ జి కళాధర్, విఆర్ఓలు తమ్మినాయన దొర, గ్రామస్తులు ఉన్నారు.

సమస్యలపై వినతులు స్వీకరణ

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నడిమికెల్లకు చెందిన వికలాంగుడు తనకు పింఛను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ డి.వెంకటరమణ, ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు, ఎపిఒ జి.సత్యం నాయుడు, ఎపిఎం కె.రామ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లక్కగూడలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను ఈనెల 20 నుండి 31 వరకు నిర్వహిస్తుందని, పశువైద్యులు రైతుల వద్దకే వచ్చి పశువులకు, మేకలకు వైద్యమందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పశు, గొర్రెల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి మన్మధ రావు, స్థానిక సర్పంచ్ సూర్యారావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, స్థానిక సీనియర్ నాయకులు కడ్రక కళావతి, పశు వైద్యాధికారి లక్ష్మణరావు, టిడిపి నాయకులు భూషణ్, రాజేష్, మన్మధ, పశు సంవర్ధకశాఖ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడి అశ్వద్ధామ కోరారు. మండలంలో కురుపాం, పెదగొత్తిలిలో సోమవారం జరిగిన పశు ఆరోగ్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరం పాడి రైతులకు ఎంతగానో దోహదపడతాయని కావున ప్రతి ఒక్క పాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్య అధికారి కె.శైలజ, మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, ఎంపిటి మాజీ వైస్ ఎంపిపి కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి రమణమూర్తి, టిడిపి నాయకులు కర్రి శ్రీను, రామకృష్ణ, మిన్న, సాయి, విజయ్, పాడి రైతులు పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని పశువుల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి, వెంకంపేటలో పశు ఆరోగ్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. పశువుల్లో వచ్చే సాధారణ రోగాలతో పాటు అంటు రోగాలను, నట్టల నివారణ మందులను ఎప్పటికప్పుడు వేసుకొని పాడిపశువుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ అందించే పశుగ్రాసాలను వినియోగించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదబొండపల్లి, ఎమ్మార్ నగరం, నర్సిపురం పశు వైద్యులు డాక్టర్ చక్రధర్ రావు, డాక్టర్ రెడ్డి రమేష్, డాక్టర్ జై రాము పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి ఉరిటి రామారావు అన్నారు. మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాన్ని మండలంలోని మరుపెంటలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి ఉరిటి నిర్మల మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


సీతానగరం : ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధశాఖ ఎడి దీనకుమార్


దూడకు వ్యాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సీతానగరం: మండలంలోని సూరంపేట, మరిపివలస, చిన్నరాయుడుపేట, గెడ్డలుప్పి, కొత్తవలసలో ఉచిత పశు వైద్య శిబిరాలు ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఎడి సిహెచ్ దీన కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరాల్లో పశువులకు ఎటువంటి వ్యాధులున్నా వాటిని గుర్తించి వైద్యం అందించి మందులు ఇస్తామన్నారు. ఈ శిబిరాల్లో 281 పశువులకు టీకాలు మందులు ఇచ్చామన్నారు. బలిజిపేట మండలం మిర్తివలస, వెంగాపురంలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు, సిహెచ్ గణేష్, పశు వైద్య సిబ్బంది, ఆయా గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట, భామిని మండలాల్లో ఈనెల 20 నుంచి 31 వరకు పశువు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా మండలంలో సోమవారం కుసిమి, మానాపురం, జామి తోట గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. మానాపురంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ పశువ ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువు ఆరోగ్య శిబిరాలు పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతులకు ముంగిట్లో పశువైద్య శిబిరం వచ్చిందని దీన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులకు సంబంధించి అన్ని టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పశువు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధోను భాయి వైద్యాధికారి డాక్టర్ శంకర్రావు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రోగుల సర్వే పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కుష్టువ్యాధి లక్షణాలు గుర్తించడానికి సర్వే చేపడుతున్న తీరు, ఏ మేరకు పూర్తి చేశారన్న వివరాలను రు వివరాలను వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పరిశీలించారు. మండలంలోని ఎంఆర్ నగరం, చినబొండపల్లి గ్రామాలను సోమవారం సందర్శించి హెల్త్, వెల్నెస్ కేంద్రాలు, లెప్రసీ సర్వే తనిఖీ చేశారు. అనుమానిత లక్షణాలతో ఎవరినైనా గుర్తించారా అని ఆరా తీసి సర్వే పూర్తి చేసి, ఇంటికి మార్కింగ్ విధానాన్ని గమనించారు. ప్రతి ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అందర్నీ క్షుణ్ణంగా పరీక్షించాలన్నారు. లక్షణాలను త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని సూచించారు. కుష్టువ్యాధిని గుర్తించే లక్షణాల కరపత్రికలను ప్రజలకు అందజేసి అవగాహన కల్పించాలన్నారు. అక్కడ స్థానికులతో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఓపి రికార్డులు, మందులు తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఎంత మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు, అందిస్తున్న చికిత్సా వివరాలు పరిశీలించారు. మందుల లభ్యత, కాలపరిమితి పరిశీలించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలు వైద్య అవసరాల నిమిత్తం ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సత్తిబాబు, జయలక్ష్మి, వైద్య సిబ్బంది పద్మావతి, కమలకుమారి, నందిని, పోలమ్మ, ఆశా కార్యకర్తలు, సిహెచ్‌డబ్ల్యుఒలు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లాప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

సీతానగరం: మండలంలోని సీతానగరం, పెదఅంకలాం పిహెచ్‌సిల పరిధిలో గల అన్ని సచివాలయాలో పరిధిలో కుష్టి వ్యాధి గుర్తింపుపై ఇంటింటా సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైద్యాధికారులు పి.ఉషారాణి, ఎం.రాధాకాంత్, పి.పావని మాట్లాడుతూ వైద్య సిబ్బంది వచ్చేటప్పుడు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్వీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమల్లో టిడిపి కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ విమర్శించారు. సోమవారం ఆయన పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా, ఇంతవరకు సంక్షేమ పథకాల అమలపై స్పష్టత లేదని చెప్పారు. అధికారం కోసం ప్రజల్ని మభ్యపెట్టేందుకు లేనిపోని హామీ లిచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.1500 చొప్పున, నిరుద్యోగ యువతకు రూ.3వేల భృతి, రైతు భరోసా కింద ఏడాదికి రూ.20వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు వాటి అమలు ఊసే లేదని అన్నారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో కలిసి భవిష్యత్తులో కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు. పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఆధ్వర్యాన మున్ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడు, పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.

పాలవలస కుటుంబానికి పలువురి పరామర్శ

పాలకొండ: వైసిపి సీనియర్ నాయకులు, జెడ్‌పి మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతి చెందిన విషయం తెలుసుకొని సోమవారం వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ తలశిల రఘురాం, జెసిఎస్ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి రాజశేఖరం సతీమణి పాలవలస ఇందుమతిని, ఆయన కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పరామర్శించారు. రాజశేఖరం మృతికి సంతాపం తెలిపారు. వీరు వెంట మాజీ ఎమ్మెల్యే కళావతి, ఎపి టిడ్కో మాజీ చైర్మన్ ప్రసన్న కుమార్ తదితరులు ఉన్నారు.

టిడిపి కేంద్ర కార్యాలయం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పార్వతీపురం రూరల్ : అమరావతిలో గల టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గం సమస్యలపై వినతి పత్రం అందించినట్లు కొప్పల వెలమ కార్పొరేషన్ సభ్యులు గొట్టాపు వెంకటనాయుడు తెలిపారు. నియోజకవర్గానికి ప్రధాన సమస్య అయిన జంఝావతి, ఆడారు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, రోడ్లు విస్తరించాలని రాష్ట్ర ఆర్అండ్‌బి మంత్రి బీసీ జనార్దన్‌కు వినతి అందించినట్లు తెలిపారు.

ఘనంగా పిల్లి పండగ సంబరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముతా గిరిజన కొండదొర కులానికి చెందిన విశ్వనాధపురం, లోవలక్ష్మీపురం, బుడ్డెమ్మఖర్జ, దొరజమ్ము గ్రామాల్లో ప్రజలు సోమవారం పిల్లి పండగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గిరిజన కులాల్లో కొండదొర కులానికి పిల్లి పండగ ఆచార సాంప్రదాయం పూర్వీకుల నుంచి ఉందని అన్నారు. అదే విధంగా గిరిజన సంప్రదాయ ఆచారం ప్రకారం, కంది కొత్త పండుగ గిరిజనులకు ఎంత ముఖ్యమో, పిల్లి పండగ కూడా గిరిజన కొండదొర కులానికి అంతే ముఖ్యమని తెలిపారు. అంతేకాకుండా కంది కొత్త పండుగకు, సతరమ్మ, గొడ్డలమ్మ, జాకరమ్మ అనే కొండ దేవతలను కొలుసుకుంటూ బోగా భాగ్యలతో ఏవిధంగా సంబరాలు చేస్తామో అదేవిధంగా ఈ పిల్లి పండుగకు కూడా పంట నొద్దలు, వేటనొద్దలు అనే అడవిదేవతలను కొలుసుకుంటూ బోగా భాగ్యాలతో సంబరాలు చేస్తామని అన్నారు. ఈ పిల్లి పండగా సంక్రాంతి పోయిన వారం రోజుల తర్వాత జరుపుకుంటామని వివరించారు. కార్యక్రమంలో విశ్వంధపురం గ్రామపెద్దలు పూజారి ఎర్రపుదొర, చిన్నప్పుదొర, ఎజ్జిరాలు గౌరమ్మ, ఏకాసి పాడి సింహాచలం, పాడి సుదర్శనరావు, పాడి ప్రసాదరావు, పాడి నారాయణరావు, మల్లెడ నాగేశ్వరావు, రామన్నదొర, తవిటినాయుడు, రౌతు, జుగ్గు, సంతు, యువత కొండలరావు, రమేష్, చైతన్య, శివ, సాయి, నవీన్, చంటి, లవ, సతీష్, అనిల్, త్రినాధ్, గణేష్, సురేష్, మురళీ, సంజీవ్, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.


గ్రామంలో కొండదేవతలను ఊరేగిస్తున్న గిరిజనులు

బాలికల భవిష్యత్తు కోసం సుకన్య సమృద్ధి యోజన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

చిన్నారి బాలికల భవిష్యత్తు ఆర్థిక అవసరాల కోసం సుకన్య సమృద్ధి యోజన ఎంతగానో ఉపయోగపడుతుందని పార్వతీపురం డివిజనల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు అన్నారు. ఈనెల 24న జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. పదేళ్ల వయస్సు గల బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు అన్ని పోస్ట్ ఆఫీసులు తెరవబడతాయని, అర్హత గల ప్రతి ఒక్కరూ తమ సమీప పోస్టాఫీసు వారిని సంప్రదించి ఈ ఖాతాలో తెరవడం ద్వారా బాలికల భవిష్యత్తు ఆర్థిక అవసరాలకు పొదుపు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు సమీప ప్రధాన ఉప బ్రాంచి పోస్ట్మాస్టర్‌ను సంప్రదించాలని కోరారు.


పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, ఎంపిడిఒ

సీనియర్ అధికారులనే నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధి గిరిజన సంక్షేమ డిడి విభాగంలో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టును ఆ విభాగంలో పనిచేసిన సీనియర్ ఉద్యోగిని అధికారిగా నియమించాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఐటిడిఎ కార్యాలయంలో ఎపిఒ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే గురుకులం విభాగంలో ఖాళీగా ఉన్న ఒఎస్‌డి, సూపరింటెండెంట్ పోస్టును గురుకులానికి సంబంధించిన అధికారిని నియమించాలని కోరుతూ గిరిజన సంఘాల నాయకులు పల్ల సురేష్, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, రొబ్బ లోవరాజు, రామకష్ణ డిమాండ్ చేశారు.

1800 లీటర్ల బెల్లం ఊట నేలమట్టం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దారిమల్లి సమీపంలో మల్లమ్మకొండపై 1800 లీటర్ల బెల్లం ఊటలను ఎస్సై వై.అమ్మనరావు నేలమట్టం చేశారు. తన సిబ్బందితో మాటువేసి సారా తయారీ కేంద్రంపై గురి పెట్టారు. 1800 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసి 30 డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సారా తయారీ కేంద్రాలపై దాడులు తప్పవని హెచ్చరించారు. సారా విక్రయించిన రవాణా చేసిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహనాల ద్వారా రవాణా చేస్తే సీజ్ చేస్తామన్నారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో గత కొంతకాలంగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న రాజాం రమణమూర్తి అనారోగ్యంతో సోమవారం తన ఇంటి వద్ద మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, బాసర కాంతారావు, కె.విజయకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, దుంపల చిన్ని తదితరులు దగ్గరుండి అంత్యక్రియలు చేపట్టారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు రూ.10వేలు, కమిషనర్ రూ.15వేలు, వైసిపి కౌన్సిలర్లు వెలమల మన్మధరావు రూ.5వేలు కుటుంబానికి అందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

మన ఇంటి పరిసర ప్రాంతాలు, మన వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనదేనని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్ వీధిలో గల ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ చుట్టూ చెత్తా చెదారం పోయడం వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. అనంతరం స్థానిక పంచాయతీ సిబ్బందికి వీధిలో లీకైన పైపులైన్ పనులను త్వరగా మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

ప్రజాశక్తి - సీతానగరం

వాహనదారుడికి వేగం కన్నా ప్రాణం మిన్న అనే నినాదంతో ప్రయాణం చేయాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించి బంగారు భవిష్యత్తుకు బాటగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని నీలకంఠాపురంలో సోమవారం జరిగిన వారపు సంతలో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావుకార్యక్రమంలో భాగంగా గిరిజనులకు రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మహిళా చట్టాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించకూడదని,రహదారి భద్రతా నియమాలు పాటించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని, మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి డిఎస్‌పిగా భవ్య

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి డిఎస్‌పిగా జి.భవ్యరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డిఎస్‌పి శ్రీనివాసరావుకు నర్సీపట్నం బదిలీ అయింది. భవ్యకు డిఎస్‌పి శ్రీనివాసరావు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. బొబ్బిలి డివిజన్‌లో శాంతిభద్రతలను కాపాడేందుకు, నేరాలు, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి భవ్య చెప్పారు. గంజాయి, మాదకద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, రైల్వే, టెలికాం రంగాల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. గ్రూపు-1లో డిఎస్‌పిగా ఉద్యోగం సాధించి, బొబ్బిలిలో మొదటిసారిగా బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు.

జల వనరుల శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

జల వనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం ప్రస్తుతం కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం కోరింది. సోమవారం వెలగవాడ దగ్గర కొత్తగా పరిశీలించింది. రైతులకు ఈ కార్యాలయం దూరమవుతుందని, అదేవిధంగా రోడ్డు విస్తరణ పనుల్లో సగం కార్యాలయం పోతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. పాత కార్యాలయం దగ్గరే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కలెక్టర్ దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిత అప్పలనాయుడు, నీటిసంఘం డైరెక్టర్ పామోటి వైకుంఠరావు, దుప్పాడ చిన్ననాయుడు, రాము తదితరులు ఉన్నారు.

ఎంఇఒల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండల విద్యాశాఖాధికారి- 1 సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ్‌రామరాజుకు వినతి పత్రం సమర్పించినట్లు ఎంఇఒ-1 అసోసియేషన్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. సోమవారం విద్యాశాఖ డైరెక్టర్ శ్రీకాకుళం విచ్చేసిన సందర్భంగా ఆయన్ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ముఖ్యంగా ఎంఇఒ -1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరారు. హైస్కూల్ హెచ్‌ఎంలకు, ఇతర గెజిటెడ్ అధికారులకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ ఉండగా మండలంలో దాదాపు 150 నుండి 200 మంది టీచర్లకు డిడిఒగా ఉన్న ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడంతో చాలా ఇబ్బందింగా ఉందని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరామన్నారు. అలాగే ఎంఇఒ -1కు 2017 నుంచి ఇంత వరకు బదిలీల నిర్వహించకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారని, కావున బదిలీలు నిర్వహించాలని, జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఎంఇఒ -1 లకు రెగ్యులర్ డిప్యూటీ ఇఒలుగా, జిల్లా సెక్టోరియల్ అధికారులుగా, అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లుగా ఉద్యోగోన్నతులుకల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలల సందర్శన, తనిఖీలు విధులు నిర్వహిస్తున్న తమకు వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. తమ వినతిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 సంఘ నాయకులు ధనంజయ మజ్జి, జె.నారాయణస్వామి, పి.జోగారావు, ఎస్.జోరాడు తదితరులు పాల్గొన్నారు.